గ్రంథాలయ నిర్మాణానికి గ్రహణం

- అద్దె భవనంలోనే కొనసాగుతున్న వైనం
- దినపత్రికలకే పరిమితం
- స్థలం కేటాయించినా ముందుకుసాగని పనులు
- ఎన్‌వోసీ అందించిన పంచాయతీ



అద్దె భవనంలో గ్రంథాలయం

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలంలో ఉన్న ఏకైక గ్రంథాలయ శాశ్వత భవన నిర్మాణానికి రెండు దశాబ్దాలుగా గ్రహణం వీడడం లేదు. మూడేళ్ల క్రితం స్థలం కేటాయింపు, నిధుల మంజూరు వచ్చినట్లే వచ్చాయని, ఇక పనులు షూరు చేయడమే తరువాయి అని భావించిన వారికి నిరాశే మిగిలింది. పదేళ్ల క్రితం వరకు నిత్యం యాభై నుంచి డెబ్బై మందిపైగా ఈ గ్రంథాలయానికి పుస్తక ప్రియులు వచ్చేవారు. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. కేవలం దినపత్రికలకే పరిమితం కావడంతో రోజులో పదిమంది కూడా గ్రంథాలయాన్ని సందర్శించడం లేదని తెలుస్తోంది.

ఇన్‌చార్జి లైబ్రేరియన్..

ముస్తాబాద్ శాఖ గ్రంథాలయం పదిహేనేళ్లుగా ఇన్‌చార్జి లైబ్రేరియన్‌తోనే నడుస్తోంది. అది కూడా అద్దె భవనంలో కొనసాగుతోంది. గంభీరావుపేటకు చెందిన ఉద్యోగి ముస్తాబాద్‌లో వారానికి రెండు రోజులు వచ్చి వెళ్తాడు. స్వీపర్ ఒక్కరే గ్రంథాలయాన్ని తీసి నడుపుతున్నారు. అది కూడా గ్రంథాలు, పుస్తకాలు ఉండే గదికి తాళం వుండడంతో రీడింగ్ రూంలో కేవలం దినపత్రికలు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. రెగ్యులర్ లైబ్రేరియన్‌ను నియమించి, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి అవసరమైన గ్రంథాలు, పుస్తకాలను అందుబాటులో ఉంచాలని నిరుద్యోగులు, విద్యార్థులు కోరుతున్నారు.

స్థలం ఉన్నా.. నిధులు ఎక్కడ?

ఈ లైబ్రరీకి ఐదేళ్ల క్రితం వరకు స్థలం సమస్యగా ఉండేది. శాశ్వత భవనం నిర్మించాలన్న జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు ఆకునూరి శంకరయ్య విజ్ఞప్తి మేరకు సర్పంచ్ గాండ్ల సుమతి స్థల సేకరణ చేపట్టారు. లేఅవుట్ ద్వారా ముస్తాబాద్‌లోని సింగిల్‌విండో గోదాం వద్ద ఉన్న నాలుగు గుంటల స్థలాన్ని గ్రంథాలయానికి కేటాయించారు. రెండేళ్ల క్రితమే పంచాయతీ పాలకవర్గం సైతం తీర్మానం చేసి, ఎన్‌వోసీని గ్రంథాలయ సంస్థ అధికారులకు అందజేశారు. అయితే రూ.25 లక్షలు ప్రత్యేకంగా మంజూరయ్యేలా జిల్లా చైర్మన్ కృషి చేశారు. దీనికి సకాలంలో టెండర్ నిర్వహించకపోవడం, గ్రంథాలయ సంస్థ అధికారులు సకాలంలో స్పందించకపోవడంతో మంజూరైన నిధులు వెనక్కి వెళ్లినట్లు సమాచారం. స్థలం క్లియర్‌గానే ఉన్నా నిధుల మంజూరు సమస్యగా మారినట్లు తెలుస్తోంది.

పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యేదెలా?

ఈ గ్రంథాలయంలో లైబ్రేరియన్ లేకపోవడంతో ఉన్న పుస్తకాలు ఎవరికి అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఉపాధ్యాయ ఉద్యోగార్థులు టెట్ కోసం ప్రిపేర్ అవుతుండగా, ఎలాంటి మెటీరియల్ లేదు. పలు గ్రామాల నుంచి వస్తున్న వారు టెట్ మెటీరియల్ కోసం అడుగుతున్నారు. ఇక లైబ్రరీలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి కావాల్సినంత మెటీరియల్ ఉంది. గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యేవారికి ఉపయోగపడే మెటీరియల్ ఉంది. అయితే లైబ్రేరియన్, శాశ్వత భవనం లేకపోవడమే అసలు సమస్యగా మారింది. పంచాయతీ పాలకవర్గం కేటాయించిన నాలుగు గుంటల స్థలంలో శాశ్వత భవనం నిర్మించి, లైబ్రేరియన్‌ను నియమించాలని మండల వాసులు కోరుతున్నారు. దినపత్రికలతోపాటు వార, పక్ష పత్రికలను, ఉద్యోగ సమాచార పత్రికలను అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

లైబ్రేరియన్‌ను నియమించాలి



ముస్తాబాద్‌లో ఉన్న ఏకైక గ్రంథాలయానికి లైబ్రేరియన్‌ను వెంటనే నియమించాలి. నిరుద్యోగులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను అందుబాటులో ఉంచాలి. లైబ్రేరియన్ ఉండడం వల్ల నిరుద్యోగులకు, విద్యార్థులకు కావాల్సిన మెటీరియల్ అందుబాటులోకి వస్తుంది. – సద్ది మధుసూధన్‌రెడ్డి, ముస్తాబాద్

నిధులు మంజూరు చేయాలి



ఎంతోమంది నిరుద్యోగులు, విద్యార్థులకు ఉపయోగపడే గ్రంథాలయానికి శాశ్వత భవనాన్ని నిర్మించాలి. ప్రజలు లైబ్రరీ ఫీజులు చెల్లిస్తున్నా ఆ దిశగా వసతులు కల్పించడం లేదు. పంచాయతీ వారు కేటాయించిన స్థలంలో అందరికి ఉపయోగపడే భవన నిర్మాణానికి నిధులు వెంటనే మంజూరు చేయాలి. – తోట ధర్మేందర్, పోతుగల్

రెండేళ్ల క్రితమే స్థలం కేటాయించాం



రెండేళ్ల క్రితమే నాలుగు గుంటల స్థలాన్ని కేటాయించాం. పాలకవర్గం కూడా తీర్మానం చేసి ఎన్‌వోసీ కూడా అందజేశాం. మొదట నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఇప్పుడు నిధులు వెనక్కి వెళ్లినట్లు తెలుస్తోంది. ప్రజలకు ఉపయోగపడేలా లైబ్రరీ నిర్మించాలని మేము కూడా కోరుతున్నాం. – గాండ్ల సుమతి, సర్పంచ్, ముస్తాబాద్

క్లుప్తంగా

గొల్లకుర్మలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి


గొర్రెలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రసమయి

ఇల్లంతకుంట: గొల్లకుర్మలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ గొల్లకుర్మలకు సబ్సిడీపై గొర్రెలను అందజేస్తున్నారని మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని రేపాక, ఆరెపల్లి గ్రామాలకు చెందిన గొల్లకుర్మలకు 25 యూనిట్ల గొర్రెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం 75 శాతం సబ్సిడీపై గొర్రెలను అందజేస్తుందన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి మాంసం కోసం గొర్రెలను దిగుమతి చేసుకోకుండా తెలంగాణ నుంచే ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, సింగిల్‌విండో చైర్మన్ రొండ్ల తిరుపతిరెడ్డి, సర్పంచ్ రొండ్ల లక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధిహామీ పని దినాలు పెంచాలి


చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్‌తో కొత్తపేట గ్రామస్తులు

బోయినపల్లి: మండలంలోని కొత్తపేట గ్రామస్తులు సోమవారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉపాధి హామీ పని దినాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే గ్రామంలో అభివృద్ధి పనులకు సహకరించాలన్నారు. గ్రామంలో మిడ్ మానేరులో ముంపునకు గురై గెజిట్ కాని వారి పేర్లు గెజిట్‌లో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సత్తినేని మాధవ్, మండల కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అజ్జు, ఉపసర్పంచ్ బోనాల తిరుపతి, నాయకులు ల్యాద రమేశ్, చిందం వేణు, నారాయణ, ఇల్లెందుల రాజు, జీ. బాల్‌రెడ్డి, కాశీరాం, అరవింద్, నాగరాజు పాల్గొన్నారు.

ఓటర్ లిస్టు పరిశీలన


ఓటర్ లిస్టు పరిశీలిస్తున్న కార్యదర్శులు

తంగళ్లపల్లి: మండలంలోని 30 గ్రామాల్లోని ఓటర్ల లిస్టులో 1500 మంది ఓటర్ల జాబితాను సోమవారం ఎంపీడీవో పి.లచ్చాలు ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు ఓటరు లిస్టును పరిశీలించి చనిపోయిన ఓటర్లు, ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన ఓటర్లను గుర్తించి నమోదు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీవో విజయేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

సిరిసిల్లఅర్బన్: సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 17 వరకు నిర్వహించే తెలంగాణ సాయుధ రైతాంగా పోరాట వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను సీపీఐ నాయకులు సోమవారం ఆవిష్కరించారు. ఈనెల 16న బైపైనగర్ చౌరస్తాలో నిర్వహించే భారీ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా సీపీఐ జాతీయ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి హాజరవుతున్నారని, ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, నాయకులు పంతం రవి, సోమల మల్లేశం పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా సాగేందుకు సహకరించాలి


మాట్లాడుతున్న ఎస్సై ఆశోక్

చందుర్తి: రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికలు సజావుగా సాగేందుకు సహకరించాలని ఎస్సై సిరిసిల్ల ఆశోక్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల మోడల్ కోడ్‌పై మండలంలోని రాజకీయ పార్టీల నాయకులతో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఎలాంటి గొడవలకు దిగిన కేసుల పాలవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ లీలారాణి, ఆర్‌ఐ రవీందర్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షులు మ్యాకల ఎల్లయ్య, బీజేపీ మండలాధ్యక్షులు పోంచెట్టి రాకేశ్ పటేల్, పార్టీ నాయకులు బైరగోని రమేశ్, కట్కూరి చంద్రయ్య, కొమ్ము రమేశ్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి


నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే

ముస్తాబాద్: ఎల్లారెడ్డిపేట మండలం దుమాల మాజీసర్పంచ్ గుక్లపెల్లి ఎల్లారెడ్డి సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే వుచ్చిడి మోహన్‌రెడ్డి అన్నారు. దుమాలలో అనారోగ్యంతో మృతి చెందిన ఎల్లారెడ్డి సంస్మరణ సభ సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి, ఆయన చేసిన సేవలను కొనియాడారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, సుభాష్, నర్సింహారెడ్డి, బాల్‌రెడ్డి, లింగారెడ్డి, బాలకిషన్, ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

'ఇంద్రధనుష్'పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ముస్తాబాద్: ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ ఇమ్యూనైజేషన్ టీకాలు వేయించాలని పోతుగల్ వైద్యాధికారి గీతాంజలి కోరారు. మండలంలోని పోతుగల్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం అవగాహన కల్పించారు. సెప్టెంబర్ 11 నుంచి 16 వరకు టీకాలు ఇస్తామన్నారు. టీకా తీసుకోని వారు, వలస కార్మికుల పిల్లలను గుర్తించి టీకాలు వేస్తామన్నారు. చిన్నారులను వ్యాధుల బారి నుంచి తప్పించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హెచ్‌ఈవో యాదగిరి, ఏఎన్‌ఎమ్‌లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ సెంటర్‌లో చోరీ

ముస్తాబాద్: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహ ఫ్లెక్సీ సెంటర్‌లో ఆదివారం చోరీ జరిగింది. బాధితుడు గనగొని బంటి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మెయిన్ రోడ్డులోని ఫ్లెక్సీ సెంటర్‌లో ఇంటి వెనుకాల నుంచి గుర్తు తెలియని యువతి స్క్రూ డ్రైవర్ సాయంతో డోర్ తెరిచి లోపలికి ప్రవేశించినట్లు సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. దుకాణం కౌంటర్‌లోని రూ.2,500 నగదును ఎత్తుకెళ్లారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు బంటి తెలిపారు.

మధ్యాహ్న కార్మికుల సమ్మె నోటీసు


ముస్తాబాద్‌లో సమ్మె నోటీసు ఇస్తున్న కార్మికులు

ముస్తాబాద్: పెంచిన వేతనాలు అందించి, పెండింగ్ బిల్లులను అందించాలని కోరుతూ మధ్యాహ్న భోజన నిర్వహణ కార్మికులు విద్యాశాఖ అధికారులకు సమ్మె నోటీసును సోమవారం ముస్తాబాద్‌లో అందించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం అధ్యక్షురాలు గొట్టె సంతోష మాట్లాడుతూ గతంలో సమ్మె చేసినప్పుడు ప్రభుత్వం రూ.2 వేల వేతనాలు పెంచుతూ హామీ ఇచ్చిందని, పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని చెప్పి ఇప్పటి వరకు నేరవేర్చలేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టికోకపోవడంతో ఈనెల 13 నుంచి సమ్మె చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్మికులు నర్సవ్వ, దేవలక్ష్మి, రేణుక, భారతి, వెంకట నర్సవ్వ, దేవవ్వ, విజయ, భాగ్య, సత్యవతి పాల్గొన్నారు.

కోనరావుపేట: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సెప్టెంబర్ 13 నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నామని మండలంలోని మధ్యాహ్న భోజనకార్మికులు తహసీల్దార్‌కు సమ్మె నోటీస్‌ను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి మాట్లాడుతూ జీవో నెంబర్ 8 ప్రకారం కార్మికులకు పెంచిన వేతనాలను ఏరియర్స్‌తో సహా చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలన్నారు. పాఠశాలలో వంట షెడ్లు నిర్మించి, వంట పాత్రలను అందించాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 13నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు జి. బాలమణి, మమత పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ విధానం రద్దు చేయాలి

సిరిసిల్లఅర్బన్: ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ విధానం రద్దు చేసి ప్రభుత్వం నేరుగా వేతానాలు చెల్లించాలని బీఆర్‌టీయూ అధ్యక్షుడు దుర్గం శ్రీనివాస్ అన్నారు. సోమవారం జిల్లా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుధ్య కార్మికులకు రూ.19వేలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం సిరిసిల్ల జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా వి.రాజేందర్, ప్రధాన కార్యదర్శి రాకేశ్, కోశాధికారి శ్యామ్ ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రవిందర్, కోశాధికారి సుభాష్, రాష్ట్ర అధికార ప్రతినిధి కిరణ్ పాల్గొన్నారు.

గణేశ్ మండపాల వద్ద సీసీ కెమెరాలు

- ఎల్లారెడ్డిపేట సీఐ శశిధర్‌రెడ్డి


ఎల్లారెడ్డిపేటలో మాట్లాడుతున్న సీఐ శశిధర్‌రెడ్డి

ముస్తాబాద్/గంభీరావుపేట: వినాయక మండపాల వద్ద నిర్వాహకులు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎల్లారెడ్డిపేట సీఐ శశిధర్ రెడ్డి సూచించారు. సోమవారం ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట పోలీస్‌స్టేషన్‌లలో వినాయక మండపాల నిర్వాహకులతో వేర్వేరుగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాంతియుతంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించాలన్నారు. కరెంట్ పోల్స్ వద్ద, రోడ్లకు అడ్డంగా మండపాలను ఏర్పాటు చేయవద్దన్నారు. ప్రజలలో భక్తిని కలిగించేలా మండపాలను నిర్వహించాలన్నారు. రాత్రివేళల్లో మండప నిర్వాహకులు తప్పనిసరిగా నిద్రించాలన్నారు. పోలీస్‌శాఖ జారీ చేసే నియమ నిబంధనలకు అనుగుణంగా వినాయక మండపాల ఏర్పాటు, నిమజ్జన ప్రక్రియ, సౌండ్ బాక్స్‌ల ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాల వద్ద మద్యం, అసభ్యంగా నృత్యాలు చేయకూడదని స్పష్టం చేశారు. నిమజ్జనం రోజున నిర్ణీత సమయంలో శోభయాత్ర ముగించాలన్నారు. ఎస్సైలు రమాకాంత్, మహేశ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతమైన వాతావరణంలో పండుగులు జరుపుకోవాలి


రుద్రంగి: మాట్లాడుతున్న ఎస్సై రాజేశ్

రుద్రంగి/కోనరావుపేట: వినాయక చవితి, మిలాన్ ఉల్ నబీ వేడుకలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని రుద్రంగి, కోనరావుపేట ఎస్సైలు రాజేశ్, ఆంజనేయులు సూచించారు. సోమవారం ఆయా పోలీస్‌స్టేషన్‌లలో వినాయక మండపాల నిర్వాహకులు, ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వినాయక మండపాలకు పోలీస్‌స్టేషన్‌లో, విద్యుత్ వినియోగానికి సెస్ అధికారుల వద్ద తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని, మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. అలాగే డీజే సౌండ్స్ ఏర్పాటు చేయవద్దని హెచ్చరించారు.

కొనసాగిన అంగన్‌వాడీలు

- తెరుచుకోని 8 కేంద్రాలు


ముస్తాబాద్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ అరవింద

ముస్తాబాద్: మండలంలో అంగన్‌వాడీ టీచర్ల సమ్మె ప్రభావం కనిపించలేదు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తలపెట్టిన నిరవధిక సమ్మె మేరకు సోమవారం ముస్తాబాద్ మండలంలో 8 అంగన్‌వాడీ కేంద్రాలు మాత్రమే సమ్మె పాటించాయి. గూడెం సెక్టార్‌లో 27 కేంద్రాలు ఉండగా అందులో 8 కేంద్రాల టీచర్లు, ఆయాలు సమ్మెలోకి వెళ్లాయని సూపర్‌వైజర్ కళావతి తెలిపారు. అలాగే ముస్తాబాద్ సెక్టార్ పరిధిలో 25 అంగన్‌వాడీ కేంద్రాలు యధావిధిగా నడిచాయని సూపర్‌వైజర్ అరవింద తెలిపారు. తమ రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్లు అందజేయాలన్న ప్రధాన డిమాండ్లతో అంగన్‌వాడీలు సమ్మె నోటీసు ఇచ్చిన విషయం విదితమే.

ఆశ కార్యకర్తల అరెస్టు


తంగళ్లపల్లి: ఆశా వర్కర్లకు సంఘీభావం తెలిపిన కాంగ్రెస్ నాయకులు

తంగళ్లపల్లి/ఇల్లంతకుంట/బోయినపల్లి: సీఐటీయూ పిలుపు మేరకు తమ సమస్యల పరిష్కారం కోసం చలో హైదరాబాద్‌కు తరలుతున్న ఆశ కార్యకర్తలను ఆయా పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం అరెస్టు చేశారు. బోయినపల్లిలో సీఐటీయూ మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలను పర్మినెంట్ చేసి, రూ. 18 వేల వేతనం, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఆశ కార్యకర్తల సంఘం ఇల్లంతకుంట మండల అధ్యక్షురాలు శాంత, ఆశా కార్యకర్తలు కన్నం లత, ఎర్ర చంద్రకళ, కట్ట అనసూయ, ఎడపెల్లి శాంత, గోనె లత, భారతి, మంజుల, కల్పన, గంగ, అరుణ, సునిత పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంఘీభావం

తంగళ్లపల్లిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాలగం ప్రవీణ్ టోని ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఆశ వర్కర్లకు సంఘీభావం తెలిపారు. ఆశాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఆశాలను వెంటనే పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగాల భూపతి, మండల ఉపాధ్యక్షుడు గుగ్గిళ్ల శ్రీకాంత్ గౌడ్, రైతు సెల్ అధ్యక్షుడు పొన్నాల పరుశురాం, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పురుసాని నాగరాజు, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు చిలుక శ్రీనివాస్ పాల్గొన్నారు.

తోటి కళాకారుల ఆర్థికసాయం


నగదు అందజేస్తున్న కళాకారులు

రుద్రంగి: గుండెపోటుతో మృతి చెందిన మండల కేంద్రానికి చెందిన కళాకారుడు ధర్మపురి లస్మయ్య కుటుంబ సభ్యులను సోమవారం తోటి కళాకారులు పరామర్శించి శ్రీగణలక్ష్మి నాట్యమండలి కళాకారుల తరపున రూ.16 వేలు ఆర్థికసాయం చేశారు. లస్మయ్య నాట్య కళ మండలికి చేసిన సేవను గుర్తు చేసుకున్నారు.

'పొన్నం'ను కలిసిన నాయకులు

వేములవాడరూరల్: బీసీ డిక్లరేషన్ కమిటీ చైర్మన్‌గా నియామకమైన మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌ను వేములవాడ రూరల్ మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం కలిసారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, సర్పంచ్ కరుణాకర్ పాల్గొన్నారు.

జనహితకు ఒక దరఖాస్తు

వీర్నపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జనహిత కార్యక్రమానికి ఒక దరఖాస్తు వచ్చినట్లు తహసీల్దార్ ఉమారాణి తెలిపారు. ప్రజల సమస్యలను సత్వర పరిష్కారం కోసం ఏర్పాటు చేస్తున్న జనహిత కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలన్నారు. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ముస్తాబాద్: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి వద్ద అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఇసుక తరలిస్తున్న అక్కపల్లి గ్రామానికి చెందిన మందాటి బాబును తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయగా, ఆరు నెలల వరకు ఇసుక తరలించకుండా నిషేధం విధించినట్లు తెలిపారు. ఒకవేళ ఇసుక తరలించి పట్టుబడితే రూ.లక్ష జరిమానా విధించడం జరుగుతుందని ఎస్సై తెలిపారు. ట్రాక్టర్‌ను ఠాణాకు తరలించామన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

కోనరావుపేట: మండలం బావుసాయిపేట గ్రామానికి చెందిన సీహెచ్ రేణుకకు రూ.23 వేలు, గంగ మల్లేశంకు రూ.13 వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సర్పంచ్ కెంద గంగాధర్, ఉపసర్పంచ్ చొక్కాల దేవరాజు, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బైరగోని రాజేశం అందజేశారు. మర్తనపేటలో మాడిశెట్టి హైమవతికి రూ.45 వేలు, మహ్మద్ ఖాజాభీకి రూ. 9 వేల చెక్కును సర్పంచ్ వెన్నమనేని వంశీకృష్ణ రావు, నాయకులు అందజేశారు.

బాలుడిపై కుక్క దాడి

కోనరావుపేట: మండల కేంద్రంలో సోమవారం ఓ బాలుడిపై కుక్క దాడి చేసింది. నేపాల్‌కు చెందిన వ్యక్తి గ్రామంలో ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నడుపుతున్నాడు. అతని సోదరుడైన నాగరాజు(12) సోమవారం రాత్రి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కు వచ్చి ఇంటికెళ్తుండగా వీధికుక్క దాడి చేయడంతో బాలుడి భుజంపై గాయమైంది. గ్రామస్తులు బాలున్ని ఆస్పత్రికి తరలించారు. మండల కేంద్రంలో కుక్కల బెడద ఎక్కువైందని గ్రామస్తులు పేర్కొన్నారు.

పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ


చందుర్తి ఎస్సీ కమ్యూనిటీ భవనానికి భూమిపూజ చేస్తున్న నాయకులు.

చందుర్తి: మండలంలోని అనంతపల్లి గ్రామంలో రూ.20 లక్షలతో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి ఎంపీపీ బైరగోని లావణ్య సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 7 గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.40 కోట్ల నిధులను మంజూరు చేయగా, నిర్మాణాలు ప్రారంభమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఐతం దేవేంద్ర, ఎంపీడీవో పత్తి రవీందర్, పంచాయతీ రాజ్ శాఖ ఏఈ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ఉపసర్పంచ్ లత, వార్డు సభ్యులు, గ్రామ కోఆప్షన్ సభ్యులు ఐతం శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆరెపల్లిలో..

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం ఆరెపల్లి గ్రామపంచాయతీ నూతన భవనం నిర్మాణం కోసం గ్రామ సర్పంచ్ ఇటుకల నవీనరాజు సోమవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉరడి ప్రవీణ్, ఉపసర్పంచ్ ఆరోగ్యమ్మ, వార్డు సభ్యులు చిలివేణి ప్రశాంత్, రాజు, గడ్డం సతీశ్, రాధ, రమ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణానికి..

చందుర్తి: మండల కేంద్రంలో ఎస్సీ(అంబేద్కర్) కమ్యూనిటీ భవన నిర్మాణానికి చందుర్తి సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు, మండల కోఆప్షన్ సభ్యులు బత్తుల కమలాకర్ సోమవారం భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు తన నిధుల నుంచి రూ.3 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సిరికొండ శ్రీనివాస్, ఉపసర్పంచ్ సిర్రం తిరుపతి, సంఘం అధ్యక్షులు లింగంపల్లి వెంకటి, సిరికొండ మల్లయ్య, సాగర్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.